ప్రతి నీటి బొట్టునూ ఒడిసి పడుదాం

విద్యార్థులకు నీటి ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

అచ్చంపేటటౌన్/ అచ్చంపేట, మార్చి 22: ప్రతి నీటిబొట్టునూ ఒడిసి పడుదాం అని నడింపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయులు సామ్యానాయక్ అన్నారు. శుక్రవారం పాఠశాలలో ప్రపంచ జల దినోత్సవం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. భూమిలో నుంచి నీటిని వాడుకోవడమే కాకుండా వర్షపు నీరు భూమిలోకి ఇంకే విధంగా ప్రతి ఇళ్లు, వీధి, కార్యాలయ ప్రాంగణాలలో ఇంకుడుగుంతలను ఏర్పాటు చేయాలని అన్నారు. దీనివల్ల భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. భూమిపై నీరు లేకపోతే జరిగే పరిణామాల గురించి వివరించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన వర్షపు నీటి సంరక్షణ ఇంకుడుగుంత గురించి విద్యార్థులకు ప్రత్యక్షంగా చూపి, ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం నీరు.. ప్రాణాధారం, నీటిని కాపాడుకుందాం అనే నినాదాలతో ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శంకరయ్య, శ్రీశైలం, జయమ్మ, వైడూర్య, స్వాతి, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

మాట్లాడుతున్న మాజీ ఎంపీపీ పుట్టా రాంరెడ్డి

వెల్దండ మార్చి 22: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన రైతు రుణమాఫీ, గృహలక్ష్మి, గృహజ్యోతి హామీలను వెంటనే నెరవేర్చాలని మాజీ ఎంపీపీ పుట్టా రాంరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం వెల్దండలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే రైతులు బ్యాంకుకు వెళ్లి రుణమాఫీ డబ్బులు తీసుకోవాలన్న సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఏమైందని ప్రశ్నించారు. రైతుబంధు పథకానికి తూట్లు పొడిచారని విమర్శించారు. పంటలకు నీళ్లు లేక రైతులు అల్లాడుతున్నారని, ఇందిరమ్మ రాజ్యం అంటే రైతులను నట్టేటముంచడమేనా అని ప్రశ్నించారు. మహిళలకు రూ.2,500, రూ.4వేల చొప్పున పింఛన్లు వెంటనే అందించి ప్రజలకిచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ అనిల్‌కుమార్, సింగిల్ విండో డైరెక్టర్ శేఖర్‌ముదిరాజ్ , చల్లా మధుసూదన్‌రెడ్డి, జంగయ్య, రమేశ్‌ముదిరాజ్, వెంకటయ్య మాజీ ఉప సర్పంచ్ నర్సింహ ముదిరాజు ఉన్నారు.

వైభవంగా వెంకన్న బ్రహ్మోత్సవాలు

ఉత్సవాలను నిర్వహిస్తున్న అర్చకులు

నాగర్‌కర్నూల్, మార్చి 22 : వట్టెం అడ్డగట్టుపై ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. 38వ వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా అర్చనలు, సేవాకాలం, బాలభోగ నివేదన, హోమాలు, అలంకరణ, రాజభోగ నివేదన, నిత్య సహస్రనామ పారాయణం తదితర పూజలను చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ నర్సింహారెడ్డి, వ్యవస్థాపక సభ్యులు ప్రతాప్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, చంద్రారెడ్డి, అర్చకులు, భక్తులు ఉన్నారు.ర

అక్రమ కేసులు బనాయిస్తున్న కాంగ్రెస్

మాట్లాడుతున్న కొర్ర వంశీనాయక్

అచ్చంపేటరూరల్, మార్చి 22: బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులపై కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ కేసులు బనాయిస్తున్నదని బీఆర్ఎస్ నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు కొర్ర వంశీనాయక్ అన్నారు. తాను ఎటువంటి కార్యక్రమాల్లో పాల్గొనకపోయినా కుట్రపూరితంగా కేసులు వేసి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని వాపోయారు. అచ్చంపేటలో నాయకులు, కార్యకర్తల అందరి ఇంటికీ నోటీసులు పంపారని అన్నారు. ప్రజల పక్షాన నిలబడి, అక్రమ కేసులను, కాంగ్రెస్ కుట్రలను ఎదుర్కొంటామన్నారు.

'ఆరు గ్యారెంటీలు అమలుచేయని ప్రభుత్వం'

వంగూరు, మార్చి 22: వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వంద రోజులు పూర్తయినా ఆరు గ్యారెంటీలు అమలు చేయక చేతులెత్తేసిందని కేటీఆర్ సేవా సమితి జిల్లా అధ్యక్షుడు అంకు సురేందర్ శుక్రవారం ప్రకటనలో విమర్శించారు. నామమాత్రపు హామీలు అమలు చేస్తున్నామంటూ కలర్ వేసుకుంటున్నారే తప్పా అవి ప్రజలకు ఏమాత్రం ఉపయోగపడడం లేదన్నారు. ముఖ్యంగా మహిళలకు నెలకు రూ.2500 ఇస్తామన్న హామీ మాటవరుసకు సైతం ప్రభుత్వం మాట్లాడటం లేదని అన్నారు. రుణమాఫీ మాయమైందని, రైతుభరోసాకు రాంరాం పలికినట్లుందన్నారు. ఇప్పటికే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొంటున్న రేవంత్ సర్కార్, ఎంపీ ఎన్నికల గెలుపు కోసం మాయమాటలు చెప్పి గట్టెక్కాలని చూస్తున్నదని దుయ్యబట్టారు.

అంగన్‌వాడీ టీచర్లను విధుల్లోకి తీసుకోవాలి

- పీడీ కార్యాలయంలో సీఐటీయూ వినతి

నాగర్‌కర్నూల్, మార్చి 22 : కొల్లాపూర్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని చింతలపల్లికి చెందిన అంగన్‌వాడీ టీచర్లు భారతి, సుగుణను అక్రమంగా విధుల నుంచి తొలగించారని, వారిని విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో పీడీ కార్యాలయంలోని సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. ఐసీడీఎస్ అధికారుల ఆదేశాల మేరకు అన్ని పనులు నిర్వహిస్తున్నప్పటికీ జీవో 14 ఆధారం చేసుకొని మూడు మెమోలు ఇచ్చి విచారణ లేకుండా రాజకీయ కక్షతో ఉద్యోగం నుంచి తొలగించడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పర్వతాలు, కోశాధికారి అశోక్, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

డ్రైవర్, కండక్టర్లు మజ్జిగ తాగాలి : ఆర్టీసీ డీఎం

నాగర్‌కర్నూల్‌టౌన్, మార్చి 22: ఎండలు మండిపోతుండడంతో డ్రైవర్లు, కండక్టర్లు ఓఆర్ఎస్, మజ్జిగ తప్పకుండా తాగాలని డిపో మేనేజర్ దేవరాజు అన్నారు. ఆర్టీసీ ఎండీ సజ్జనర్ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలోని డిపోలో, బస్టాండ్ ఆవరణలో డ్రైవర్లు, కండక్టర్ల కోసం మజ్జిగ కేంద్రాన్ని శుక్రవారం డిపో మేనేజర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండుతున్న ఎండలతో వడదెబ్బ తగిలి అనారోగ్యానికి గురయ్యే అవకాశాలు ఉండడంతో ఉద్యోగులు మజ్జిగ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ మేనేజర్ బాలసరస్వతి, ఏడీసీలు పరశురాం, యాదయ్య, సెక్యూరిటీ హెడ్‌గార్డ్ రామకృష్ణ, బాలరాజు, ప్రవీణ్, మల్లేశ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పైసాకు లెక్క చూపాల్సిందే..

- ఎస్పీ వైభవ్ రఘునాథ్ గైక్వాడ్

వెల్దండ, మార్చి 22: పార్లమెంట్, ఎమ్మెల్సీ ఎన్నికల దృష్ట్యా వాహనాల్లో రూ.50వేలకు మించి తరలించే ప్రతి పైసాకు లెక్క చూపాల్సి ఉంటుందని జిల్లా ఎస్పీ వైభవ్ రఘునాథ్ గైక్వాడ్ అన్నారు. శుక్రవారం వెల్దండ మండలం కొట్ర గేటు వద్ద పోలీస్ చెక్‌పోస్ట్‌ను ఆయన సందర్శించారు. పలు వాహనాలను తనిఖీ చేశారు. జిల్లాలో ఐదుచోట్ల పోలీస్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రతి వాహనాన్ని, తనిఖీ చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో వెల్దండ ఎస్సై రవి తదితరులు ఉన్నారు.

ఊర్కొండ పోలీస్ స్టేషన్ తనిఖీ

ఊర్కొండ: త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా పోలీస్ సిబ్బంది ఎన్నికల నియమావళిని కచ్చితంగా అమలు చేయాలని ఎస్పీ వైభవ్‌రఘునాథ్ గైక్వాడ్ సూచించారు. శుక్రవారం ఊర్కొండ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి, రికార్డులు పరిశీలించారు. మండల కేంద్రం ప్రధాన రహదారిపైన ఏర్పాటు చేసిన అంతర్ జిల్లా చెక్‌పోస్ట్‌ను పరిశీలించి, సిబ్బందితో మాట్లాడారు. పలు సూచనలు చేశారు.

కొట్ర చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్పీ వైభవ్ రఘునాథ్ గైక్వాడ్

మహిళల రక్షణకు పటిష్ట చర్యలు

- అదనపు ఎస్పీ రామేశ్వర్

గంగారంలో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ రామేశ్వర్

నాగర్‌కర్నూల్, మార్చి 22 : మహిళల రక్షణకు షీటీమ్ పటిష్టంగా పనిచేస్తున్నదని జిల్లా అదనపు ఎస్పీ రామేశ్వర్ అన్నారు. శుక్రవారం నాగర్‌కర్నూల్ పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లోని సమావేశ మందిరంలో షీటీమ్ రెస్పాండెంట్స్‌కు మనోజాగృతి సంస్థ ఆధ్వర్యంలో ఆన్‌లైన్ కౌన్సెలింగ్ నిర్వహించారు. తెలంగాణ స్టేట్ పోలీస్ ఉమెన్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో మనోజాగృతి సంస్థ గీతా చల్ల బృందంతో కలిసి జిల్లాలో 25 మందికి కౌన్సెలింగ్ ఇచ్చినట్లు తెలిపారు. ఇంటర్నెట్‌ను సద్వినియోగం చేసుకోవాలే కానీ, సైబర్ మోసాలకు గురికావద్దని తెలిపారు. వ్యక్తిగత, బ్యాంకు ఖాతా, ఏటీఎం కార్డు, ఓటీపీ వివరాలు ఇతరులకు తెలియజేయవద్దన్నారు. సైబర్ మోసాలపై 1930 టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. వేధింపులకు షీటీమ్ 87126 57676 లేదా 100 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో షీటీమ్ ఇన్‌చార్జి విజయలక్ష్మి, హెడ్‌కానిస్టేబుల్ వెంకటయ్య, పద్మ, కానిస్టేబుల్ వెంకట్‌నాయక్ పాల్గొన్నారు.

సమాజసేవకు పాటుపడాలి

బిజినేపల్లి, మార్చి 22 : విద్యార్థులు సమాజసేవ కోసం పాటుపడాలని అదనపు ఎస్పీ రామేశ్వర్ అన్నారు. శుక్రవారం మండలంలోని గంగారంలో వారం రోజులుగా పాలెం వ్యవసాయ కళాశాల ఎన్ఎస్ఎస్ శిబిరం ముగింపు సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు సేవాభావంతో మెలగాలన్నారు. అనంతరం వ్యవసాయ రంగంలో నూతన ఆవిష్కరణలు, ఉపయోగపడే మోడల్స్‌కు సంబంధించిన ప్రదర్శనలను తిలకించారు. కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల అసోసియేషన్ డీన్ పుష్పావతి, ఎస్సై నాగశేఖర్‌రెడ్డి, ఏవో నీతి, ఏఈవో ఫరీద్‌పాషా, సత్యనారాయణ, సాధన, చరణ్, రైతులు పాల్గొన్నారు.

ఆలయ భూముల్లో అక్రమనిర్మాణాలు తొలగిస్తాం

- ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాస్‌రాజ్

అక్రమ నిర్మాణాలు పరిశీలిస్తున్న అధికారులు

చారకొండ, మార్చి 22: అపర భద్రాద్రిగా పేరుగాంచిన సిరుసనగండ్ల సీతారామచంద్రస్వామి ఆలయ భూముల్లో అక్రమంగా నిర్మించిన ఇండ్లు, దుకాణాలను తొలగిస్తామని ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాస్‌రాజ్ అన్నారు. శుక్రవారం ఆలయ భూముల్లో అక్రమంగా నిర్మించుకున్న ఇండ్లను అధికారులతో కలిసి పరిశీలించారు. వీటిని తొలగించాలని కోరుతూ ఆలయ చైర్మన్ రామశర్మ హైకోర్టును ఆశ్రయించారని, ఈ మేరకు 34ఇండ్లు, దుకాణాలను తొలగించాలని హైకోర్టు ద్వారా ఆదేశాలు అందాయని తెలిపారు. దీంతో తమకు రెండు నెలలు గడువు ఇవ్వాలని ఇండ్ల బాధితులు కోరారని పేర్కొన్నారు. గడువు తర్వాత నిర్మాణాలు తొలగిస్తామన్నారు. కార్యక్రమంలో తాసీల్దార్ ప్రమీల, ఎండోమెంట్ తాసీల్దార్ గిరిధర్, ఇన్‌స్పెక్టర్ వీణధరి, ఆలయ చైర్మన్ డేరం రామశర్మ, ఈవో రఘు, సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎస్సై రాజశేఖర్, ఎంపీటీసీ లక్ష్మణ్, మాజీ సర్పంచ్ యాతంశ్రీనివాస్, ప్రశాంత్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పౌరసత్వ చట్టానికి వ్యతిరేకంగా పోరాడాలి

సదస్సులో మాట్లాడుతున్న ప్రొఫెసర్ గడ్డంలక్ష్మణ్

అచ్చంపేట, మార్చి 22: కేంద్రంలోని బీజేపీ ప్రవేశపెట్టిన సీఏఏ ఎన్నార్సీ, ఎన్పీఆర్ చట్టాలకు వ్యతిరేకంగా పోరాడాలని పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డంలక్ష్మణ్ అన్నారు. శుక్రవారం పట్టణంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సీఏఏ చట్టానికి వ్యతిరేకంగా సదస్సు నిర్వహించారు. సదస్సులో ఆయన మాట్లాడుతూ దేశంలోని ముస్లిం, క్రైస్తవులను రెండో తరగతి పౌరులుగా పేర్కొనే ప్రమాదముందన్నారు. దీనిపై దేశవ్యాప్తంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. ఈ చట్టాలు లౌకిక ప్రజాస్వామ్య గణతంత్ర దేశానికి చాలా వ్యతిరేకంగా ఉన్నాయని అన్నారు. అనంతరం పలువురు ప్రసంగించారు. కార్యక్రమంలో కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర నాయకులు ముద్దునూరి లక్ష్మీనారాయణ, జిల్లా నాయకులు మంతటి పర్వతాలు, టీపీఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి నాగభూషణం, ఆయా సంఘాల నాయకులు ఎడ్ల అంబయ్య, గోరటి అనిల్‌కుమార్, జక్కబాలయ్య, పంబలి బాలయ్య, లక్ష్మీనారాయణ, శ్రీదేవి, జక్క రామస్వామి, మోతిరాం, లక్ష్మీనారాయణ, అశోక్, ముస్లింలు, క్రైస్తవులు పాల్గొన్నారు.

నీటిని పొదుపుగా వాడుకుందాం

కల్వకుర్తి రూరల్, మార్చి 22: సహజసిద్ధంగా లభించే నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకుంటూ భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా చేద్దామని కల్వకుర్తి ప్రభుత్వ దవాఖాన సూపరింటెండెంట్ శివరాం అన్నారు. శుక్రవారం కల్వకుర్తిలోని ప్రభుత్వ దవాఖానలో ప్రపంచ నీటి దినోత్సవం నిర్వహించి, నీటి ఆవశ్యకతను రోగులకు వివరించారు. కార్యక్రమంలో వైద్యులు, ఏఎన్ఎం, వైద్య సిబ్బంది ఉన్నారు.

బ్రాహ్మణ భవన నిర్మాణానికి భూమిపూజ

కల్వకుర్తి రూరల్, మార్చి22: కల్వకుర్తి పట్టణంలోని కైలాసగిరి వద్ద శుక్రవారం బ్రాహ్మణ భవన నిర్మాణానికి అర్చకులు భూమిపూజ నిర్వహించారు. అనంతరం నిర్మాణం పనులు చేపట్టారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు దత్తాత్రేయ శర్మ, శరత్ చంద్ర, చంద్రశేఖర శర్మ, జగన్‌మోహన్ శర్మ, వంశీకృష్ణ, వేణుగోపాల్‌రావు, హరి నాథ్‌రావు, సాగర్‌శర్మ ఉన్నారు.

ఆలయ ముఖద్వారానికి భూమి పూజ

వెల్దండ మార్చి 22: మండల పరిధిలోని గుండాల అంబరామలింగేశ్వర స్వామి ఆలయ ముఖద్వారం నిర్మాణానికి మండలంలోని బొల్లంపల్లికి చెందిన చిల్వేరు అలివేలు రామస్వామి, వెంకటేశ్ పూజశ్రీ దంపతులు ముందుకు వచ్చారు. ఈ సందర్భంగా శుక్రవారం భూమిపూజ చేశారు. దాదాపు రూ.20 లక్షలతో ముఖద్వారం నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భూపతిరెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్యగౌడ్, మాజీ ఎంపీపీ పుట్టారాంరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ వెంకటయ్యగౌడ్, పర్వత్‌రెడ్డి, తిర్పత్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, మట్ట నాగేశ్ గౌడ్ ఉన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి

- ఓటు ప్రాముఖ్యతపై గ్రామాల్లో అధికారుల అవగాహన కార్యక్రమాలు

అమ్రాబాద్ తిర్మలాపూర్‌లో ఓటు హక్కు ప్రాముఖ్యతను తెలుపుతున్న సిబ్బంది

అమ్రాబాద్, మార్చి 22: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకోవాలని ఎంపీడీవో మోహన్‌లాల్ అన్నారు. శుక్రవారం మండలంలోని అమ్రాబాద్, తిర్మలాపూర్ బీకే, ప్రశాంత్‌కాలనీ గ్రామాల్లో ఓటు ప్రాముఖ్యతను ప్రజలకు వివరించారు. ఓటింగ్ శాతం పెంచేందుకు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో కృషి చేయాలని సూచించారు. 18ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. అదేవిధంగా ఐసీడీఎస్ ప్రాజెక్టు అచ్చంపేట ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో పోషణపక్షం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి అనిల్, పంచాయతీ కార్యదర్శి మల్లేశ్, అంగన్‌వాడీ టీచర్లు, వీవోలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

పోలింగ్ శాతం పెంచాలి

లింగాల, మార్చి 22: పోలింగ్ శాతాన్ని పెంచేందుకు బూత్ స్థాయి అధికారులు కృషి చేయాలని ఎంపీడీవో ఆంజనేయులు అన్నారు. శుక్రవారం మండలంలోని చెన్నంపల్లి, అప్పాయిపల్లి, ఎంసీ తండాల్లో బూత్ లెవల్ వాకింగ్, బూత్ స్థాయి అధికారులు అంగన్‌వాడీ టీచర్లు, బీఎల్‌వో, ఫీల్డ్ అసిస్టెంట్లు, వీఏవోలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ఆంజనేయులు మాట్లాడుతూ త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు హక్కుఉన్న ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఇప్పటికే మండలంలోని ఆయా పంచాయతీల్లో పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశామన్నారు.

ఊర్కొండ మండలంలో..

ఊర్కొండ, మార్చి22: 18ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటుహక్కు పొందాలని, ఓటున్న వారంతా తప్పకుండా ఓటు హక్కు వినియోగించుకోవాలని ఎంపీడీవో విజయ్‌కుమార్ చెప్పారు. శుక్రవారం ఆయన మండలంలోని రేవల్లిలో గ్రామస్తులకు అవగాహన కార్యక్రమంనిర్వహించారు. ప్రతి గ్రామంలో బూత్‌స్థాయి అవగాహన కార్యక్రమాలు తప్పకుండా నిర్వహించేందుకు, ఓటింగ్ శాతం పెంచేందుకు గ్రామ కార్యదర్శులు, అంగన్‌వాడీలు, ఇతర గ్రామ స్థాయి సిబ్బంది కృషి చేయాలని సూచించారు.

పెంట్లవెల్లి మండలంలో..

పెంట్లవెల్లి, మార్చి 22 : ఓటు వజ్రాయుధమని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో ప్రసన్నకుమారి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ ఆవరణలో బూత్ లెవల్ అధికారులు, వెలుగు కార్యాలయ సీసీలు, బుక్ కీపర్లకు ఓటరు నమోదుపై అవగాహన కల్పించారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతుల పరిశీలన

కల్వకుర్తి రూరల్, మార్చి 22: కల్వకుర్తి మండల పరిధిలోని లింగసానిపల్లి, రఘుపతిపేట గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను శుక్రవారం కల్వకుర్తి ఎంపీవో దేవేందర్ పరిశీలించారు. త్వరలో పార్లమెంట్ ఎన్నికలు జరగనున్న దృష్ట్యా పోలింగ్ కేంద్రాల్లోని వసతులను పరిశీలించి, రికార్డు చేశారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శులు, బీఎల్ఓలు తదితరులు ఉన్నారు.

పీజీ కాలేజీలో చలివేంద్రం ప్రారంభం

చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ మార్క్ పోలోనియస్

కొల్లాపూర్, మార్చి 22 : ప్రపంచ జలదినోత్సవం సందర్భంగా పట్టణంలోని పీజీ కాలేజీలో చలివేంద్రాన్ని ప్రిన్సిపాల్, ఎన్ఎస్ఎస్ చైర్మన్ మార్క్ పోలోనియస్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి ప్రాముఖ్యత, వినియోగంపై సూచనలు చేశారు. కార్యక్రమంలో సంతోష్‌కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పాల్గొన్నారు.

మెస్ సౌకర్యం లేక ఇబ్బందులు

మాట్లాడుతున్న దేవని కుమార్ మాదిగ

కొల్లాపూర్, మార్చి 22 : కొల్లాపూర్ పీజీ కాలేజీ, హాస్టల్‌లో మెస్ సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పించకపోవడంతో సుదూర ప్రాంతాల నుంచి చదువుల కోసం ఇక్కడికి వచ్చిన విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలంగాణ మాదిగ దండోరా జిల్లా అధ్యక్షుడు దేవని కుమార్‌మాదిగ విచారం వ్యక్తం చేశారు. శుక్రవారం సంఘం నాయకులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. పీజీ కాలేజీ హాస్టల్‌లో భోజన వసతిని ప్రభుత్వం కల్పించాలని పలుమార్లు మంత్రి జూపల్లికి విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరారు.

వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

వృద్ధులకు మందులు అందజేస్తున్న దృశ్యం

నాగర్‌కర్నూల్, మార్చి 22 : ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో గ్రామాల్లో అందిస్తున్న సంచార వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సొసైటీ కార్యదర్శి రమేశ్‌రెడ్డి కోరారు. నల్లవెల్లి, ఉయ్యాలవాడ గ్రామాల్లోని వృద్ధులకు శుక్రవారం వైద్య పరీక్షలు చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా యూత్ కన్వీనర్ కుమార్, పర్యవేక్షణాధికారులు కేశవులు, వినోద్, ఏఎన్ఎం జ్యోతి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నీటిని వృథా చేయొద్దు

నర్సరీలో మొక్కలకు నీళ్లు పడుతున్న ఎంపీడీవో మోహన్‌లాల్

అమ్రాబాద్, మార్చి 22: ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఎంపీడీవో మోహన్‌లాల్ ఆధ్వర్యంలో మండలంలోని ఎల్మపల్లి, అమ్రాబాద్ తదితర గ్రామాల్లో నీటి ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్మపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. నీటిని వృథా చేయకూడదని, ఇంకుడుగుంతల ద్వారా భూగర్భ జలాలను పెంచుకోవాలని సూచించారు. అదేవిధంగా ఎల్మపల్లి, అమ్రాబాద్ నర్సరీలను పరిశీలించి, మొక్కలకు నీళ్లు పట్టారు. కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, కూలీలు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

బిజినేపల్లి, మార్చి 22 : రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో గురువారం రాత్రి చోటుచేసుకున్నది. పోలీసులు కథనం ప్రకారం.. నాగర్‌కర్నూల్ మండలం తూడుకుర్తికి చెందిన దస్తగిరి, టక్రూనాయక్ ద్విచక్ర వాహనంపై వడ్డెమాన్ నుంచి బిజినేపల్లి వైపునకు సొంత పనుల కోసం వస్తుండగా, రోడ్డు దాటుతున్న ఎద్దును ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో దస్తగిరి(40) అక్కడికక్కడే మృతిచెందినట్లు తెలిపారు. టక్రూనాయక్‌కు గాయాలవడంతో చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. మృతుడి తమ్ముడు శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగశేఖర్‌రెడ్డి తెలిపారు.

విద్యార్థులకు వాటర్ బాటిళ్లు పంపిణీ

విద్యార్థినులకు వాటర్ బాటిళ్లు అందిస్తున్న క్లబ్ సభ్యులు

కల్వకుర్తి, మార్చి 22: క్లాస్‌మెట్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం కల్వకుర్తి మున్సిపాలిటీలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమికోన్నత పాఠశాల, గుండూర్, తర్నికల్, సుద్దకల్ పాఠశాలల్లో విద్యార్థులకు వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారు. వేసవికాలం దృష్ట్యా పంపిణీ చేసినట్లు క్లబ్ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో రాఘవేందర్, రమేశ్, శ్రీనివాస్, సత్యం, అశోక్, రాజేందర్, నిర్మల, రఘురాం తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్‌షాప్‌పై దాడి : లిక్కర్ స్వాధీనం

తిమ్మాజిపేట, మార్చి 22 : మండలంలోని ఆర్సీతండాలో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్‌షాప్‌పై దాడి చేసినట్లు ఎస్సై నరేందర్‌రెడ్డి తెలిపారు. 10లీటర్ల లిక్కర్‌ను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో అక్షరాభ్యాసం

తిమ్మాజిపేట, మార్చి 22 : మండలంలోని ఆవంచ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం అక్షరాభ్యాసం నిర్వహించారు. చిన్నారులతో అక్షరాలు దిద్దించారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు నిర్వహించి, పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ సరిత తదితరులు పాల్గొన్నారు.

శ్రీనిధి రుణాలతో ఆర్థికాభివృద్ధి

తిమ్మాజిపేట, మార్చి 22 : మహిళా సంఘాలకు శ్రీనిధి ద్వారా మండలంలో రూ.3కోట్ల వరకు రుణాలు ఇవ్వనున్నట్లు ఆర్ఎం మహేంద్రకుమార్ తెలిపారు. శుక్రవార